# "యుగసంధి"

సూర్యోదయమయే సరికల్లా సుబ్బయ్యగారు స్నానం, జపం ముగించుకుని వీధి వసారాలో కూర్చున్నారు. ఎదురుగుండా బ్రహ్మాండమైన గొడుగులా విప్పుకునివున్న తాతలనాటి రావిచెట్టుమీద పక్షులు అరుస్తూ ఎగురుతున్నాయి. పాలసముద్రంలోంచి పుట్టినట్లున్న తెల్లని కొంగల రెక్కలమీంచి నీరెండ జారుతుంది. కల్లాకపటం ఎరుగని అమాయకపు పక్షుల్ని చూస్తూంటే సుబ్బయ్యగారికి జాలేసింది.

గ్రామంలో దైనందిన జీవితం ప్రారంభమైంది. రైతులు పొలాలకు వెళ్తున్నారు. ఆవుల మందలు ధూళి రేపుకుంటూ పరుగెత్తుతున్నాయి. పిల్లలు వీధిలో ఆటలు ప్రారంభించారు. సుబ్బయ్యగారు యీ దృశ్యాన్ని చిన్నతనంనుండి చూస్తున్నా ఏనాటికానాడు కొత్తగానే కనిపిస్తూంది. ఆ గ్రామం భారతం లాంటి మహాకావ్యం. అందులో ఎన్నో మనస్తత్వాలు, ఎన్నో రాగద్వేషాలు, ఎంతో జీవితం. గతకలు గతకలుగా వున్న జీవితంలో కన్నీళ్ళ మడుగులా కాళ్ళు తడబడుతూ నడుస్తున్న మనుషుల ముఖాలలో విషాదరేఖలూ, వానకురిస్తే, పంట పండితే, ఆవు ఈనితే, కూలిదొరికితే, పసిబిడ్డ నవ్వితే వారిలో పైకుబికితే ఆనంద చ్ఛాయాలూ జీవిత రహస్యాలను వెల్లడించే కవితా సామగ్రి అయింది తనకు. "యుగసంధి" కావ్యం ఎప్పుడో అచ్చయి తన దగ్గిరేవుంది. అవును, ఎవరికి కావాలి గనుక! వాళ్ళనుగురించి వ్రాసిన కావ్యం వాళ్ళు చదువుకునేందుకు యింకా కొంతకాలం పడుతుంది. వాళ్ళనుగురించి వ్రాసిన

కావ్యం యితరుల కవసరంలేదు. పూచిన సంపెంగ పొలుపు తుమ్మెదలకు కిట్టదట. ఎందుకనో?

సుబ్బయ్యగారు లోపలికివెళ్ళి, నట్టింటి గుమ్మందగ్గర నిలబడి భార్య ఏంచేస్తూందో తొంగిచూశారు. ఆవిడ వెనక్కు-తిరిగి కూర్చుని కూర తరుగుతూంది.

"ఏమేవ్ కొంచెం కాఫీనీళ్ళుంటే పొయ్యిమీద పడేస్తావ్" అన్నారు.

"'కాఫీ నీళ్ళుంటే' అనే సందేహ మెందుకొచ్చిందో? నాలుగు రోజులై కాఫీ తాగడంలేదన్న సంగతి మరచిపోయారు కాబోలు."

"కాఫీ లేకపోతే అదోలావుంది సుమా."

"పోనీండి. కాఫీ ఒంటికి మంచిది కాదంటారు."

"సరే వంట వేగం కానీ అయితే."

"కాదు. ఎప్పటికేనా వంట వేగంగా అయ్యే దారి చూపించమని రోజూ దేవుడికి మొక్కు-కుంటూనే వున్నాను. ఆ భగవంతుడికి మనమీద ఎప్పుడుదయకలుగుతుందో గాని..."

"సుబ్బయ్యగారు మాట్లాడకుండా వసరాలోకి వచ్చి కూర్చున్నారు. ఏరోజుకారోజు గడవడం సమస్యగావుంది. ఊళ్ళోకి వెళ్ళి ఏ కోమటినో అడిగి యిన్ని బియ్యం తేవాలి ఆయనలేచి కండువా భుజంమీద వేసుకుని ఆకుచెప్పులు తొడుక్కు-న్నారు. భార్య వంటింట్లోంచి వచ్చి "కొంచెం ఉప్పూ, మిరపకాయలూ, బెల్లంకూడా పట్టుకురండి." అన్నది.

"సెట్టి నడుగుతాను, యిస్తే తెస్తాను."

"ఎందుకివ్వడూ? ఊరికినే యివ్వాలేమిటి? లెక్కలు వ్రాసి పెడుతున్నారు గదా?"

ఏదో అప్పుడప్పుడు వ్రాస్తూవుంటాను. వాడు తనకు తోచింది అప్పుడప్పుడు యిస్తూవుంటాడు. ఉద్యోగం గనుకనా దమాయించి అడగడానికి."

"పోనీ వాడు ఉద్యోగమిచ్చి ఉంచుకోరాదు?"

"వాడికి ఉద్యోగమిచ్చి ఉంచుకునే తాహతు లేదు, నాకు చేసే సామర్థ్యమూ లేదు"

అవిడకు ఏం మాట్లాడాలో తోచలేదు. తన ఆలోచనలకు అన్ని వేపులా తలుపులు మూసుకుపోయినట్టు అనిపించింది. భర్తను చూస్తే ఆమెకు జాలేసింది. తనమీద తనకే జాలేసింది. "ఏదైనా బడిపంతు లుద్యోగం దొరికినా బాగుండును" అన్నది.

"దాని కేదోవొక పరీక్ష ప్యాసుకావాలి గదా."

"అదే పొరపాటు చేశారేమో."

"మా నాన్నగారు నాకు యింట్లోనే తెలుగూ సంస్కృతం చెప్పేరు. అందులో నా పొరపాటేముంది? మా నాన్నగారి పొరబాటు అంతకంటే కాదు. మా తాతగారు ఆయనకలాగే చదువు చెప్పేరు. ఆ చదువు కేవలం చదువుకోసమే. ఉద్యోగాల కోసం కాదు మరి."

"పోనీండి, ఎలా రాసుంటే అలా అవుతుంది. వేగం వెళ్ళిరండి. అన్నట్టు మరచిపోయాను. మీ చిన్ననాటి స్నేహితుడికి ఉత్తరం వ్రాస్తామన్నారు, వ్రాశారా?"

"ఎవరికి, బాలయ్యకా? వాడుమాత్రం ఏంచేయగలడు? కవిత్వ గ్రంథాలకు గిరాకీ లేదు. నేను యిప్పటికి ఎన్ని ప్రయత్నాలు చేయలేదు గనుక?"

"పోనీ, ఉత్తరం ముక్క వ్రాస్తే ఏం పోయింది? ఆ పుస్తకాలన్నీ యింట్లో చెదలుపట్టిపోవటమే కదా?" అంటూ ఆవిడ లోపలికి వెళ్ళింది.

సుబ్బయ్యగారు వీధిలోకి వచ్చి నడక ప్రారంభించారు. ఎన్నో ఆలోచనలు ఆయన మనస్సును పెనవేసుకున్నాయి. తనకిక వార్థక్యం దగ్గరపడింది. జీవితమంతా దారిద్ర్యంలోనే గడచిపోయింది. ఇకముందు కూడా డబ్బు వచ్చే అవకాశం లేదు. తను కవిత్వం వ్రాశాడు. అందులో కొంత కీర్తి కూడా వచ్చింది. కాని డబ్బుమాత్రం రాలేదు. మరి తన మిత్రుడు రంగయ్య ఎలా డబ్బు చేసుకున్నాడు! మళ్ళీ వాడు పద్యం వ్రాస్తే ఏడిసినట్టుంటుంది వాడి కావ్యాలకు తనే మరమ్మత్తులు చేశాడు. అందులో ఎన్నో పద్యాలు తను మళ్ళీ త్రిప్పి వ్రాయవలసి వచ్చింది. అసలు తను వ్రాసుకున్న పద్యాలను ఎన్నో వాడే తన పేరుమీద అచ్చువేసుకున్నాడు. ఆ పుస్తకాలను పాఠ్యగ్రంథాలుగా వేయించుకున్నాడు డబ్బు సంపాదించాడు. గొప్పవాడయ్యాడు సభల్లో ఉపన్యాసాలిస్తాడు. వాడి ఉపన్యాసాలుకూడా తను వ్రాసినవే. తనకు వాడొక దమ్మిడీ యివ్వలేదు. కాని వాడు అడిగినపని తను ఎప్పుడూ చెయ్యనన లేదు. తన కవిత్వంవల్ల వాడు బాగుపడ్డాడు కాబట్టి యీ దారిద్ర్యానికి కారణం తన కవిత్వంకాదు. అయితే మరేమిటి?

నిజమే. తన భార్య సరిగ్గానే ఊహించి చెప్పింది. ఏ బడిపంతులు నౌఖరీయో చేసుకుంటే యీ సమస్యలు వచ్చేవి కావు. బతుకు గడిచిపోయేది. కాని యిప్పుడనుకుని ఏమి లాభం?

బాలయ్యకు మద్రాసులో పెద్ద పుస్తకాల వ్యాపార ముంది. చాల మంచివాడు. తను వ్రాసిన "యుగసంధి" కావ్యం అమ్మిపెడతానన్నాడు. కాని పద్యాల పుస్తకాలకు గిరాకీ లేదు కనుక ఆశ పెట్టుకోవద్దని, తన ప్రయత్నం తాను చేస్తాననీ ముందే వ్రాశాడు. ఈ విషయం తనకు అనుభవమే. అయినా పంపడమే మంచిది.

సుబ్బయ్యగారు మర్నాడు "యుగసంధి"కావ్యం వెయ్యి ప్రతులు పార్సిలు కట్టించి, రైలుద్వారా పంపించేరు. ఇంట్లో చాల యిబ్బందిగా వుందనీ, కొన్ని ప్రతులేనా అమ్మితే చాల ఉపకారం చేసినట్టవుతుందనీ బాలయ్యకు ఉత్తరంలో వ్రాశారు. ఆరుసంవత్సరాలై "యుగసంధి" కావ్యాన్ని భరించిన కావిడిపెట్టె ఖాళీ అయింది. బొద్దింకలు పైకి వచ్చాయి.

పుస్తకాలు యింటోంచి వెళ్ళిపోతే సుబ్బయ్యగారికి కుమార్తె అత్తవారింటికి వెళ్ళిపోయినట్టనిపించింది. ఎంత రసవత్తరమైన కావ్యం! మానవుడి యీతిబాధలుతీరి, వారి మనస్సూ, ప్రతిభా ప్రభవాలూ పరిపూర్ణంగా వికసించగల యుగానికిది ప్రభాత సంధ్య. తన కావ్యానికి వర్తమానం లేకపోయినా భవిష్యత్తువుంది.

వారమైంది, నెలైంది. పుస్తకాలు బాలయ్యకు చేరలేదు. రైలు రవాణాలో పార్సిలు ఎక్కడో పోయిందని తెలి

సింది. సుబ్బయ్యగారి మనస్సు వికలమైంది. రెండు రోజులు భోజనంకూడా సయించలేదు. కావ్యం ఎవరూ చదవకుండా పోయిందని చాల విచారిస్తూ ఉత్తరం వ్రాశారు. బాలయ్య ఓదారుస్తూ జవాబు వ్రాశాడు.

బాలయ్య వ్యాపారి. కావ్యం ఎవరూ చదవకుండా పోయిందనే విచారం అతనికి లేదు. అమ్ముడుపోని పుస్తకాలు ఉన్నా లేకపోయినా ఒకటేనని అతని అభిప్రాయం. ఒకవిధంగా పోవడమే అతనికెంతో సంతోషంగావుంది. సుబ్బయ్యగారికి సలహా యిచ్చాడు. తానే అర్జీ తయారుచేయించి, సంతకం చెయ్యమని పంపేడు.

రైల్వే అధికారులు సుబ్బయ్యగారి వెయ్యి పుస్తకాలు పోయినందుకు వెయ్యిరూపాయలు నష్టపరిహారం చెల్లించుకున్నారు.

మళ్ళీ పుస్తకం అచ్చువేయిస్తానన్నారు సుబ్బయ్యగారు. మళ్ళీ ఇలాంటి చాన్సు రాకపోవచ్చును. కాబట్టి వద్దని సలహా యిచ్చాడు బాలయ్య. ★